నేటి నుంచి పాఠశాలలకు సెలవులు

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 23: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలకు బుధవారం నుంచి జూన్ 11వరకు వేసవి సెలవులను ప్రభుత్వం ప్రకటించిందని డీఈవో రాజు తెలిపారు. జూన్ 12న పాఠశాలలు తిరిగి పునఃప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఈ సెలవుల కాలంలో జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు మూసివేయాలని, ఎవరైన పాఠశాలల్లో క్లాసులు నడిపిస్తే పాఠశాల యాజమాన్యంపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలో అడ్మిషన్ తీసుకునేముందు సంబంధిత మండల విద్యాశాఖాధికారిని సంప్రదించాలన్నారు.





హస్తం ఆశలు ఫలించేనా?

కామారెడ్డి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) :
జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం ఒకప్పుడు కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండేది. గతంలో ఈ ఎంపీ స్థానం కాంగ్రెస్‌దే కాగా, ఈ సెగ్మెంట్‌లోని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పాగా వేశారు. అలాంటి కంచుకోట ఉన్న జహీరాబాద్ ఎంపీ స్థానాన్ని ఈ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కైవసం చేసుకొని పూర్వవైభవం సాధించేందుకు ఆ పార్టీ అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్‌షెట్కార్‌ను గెలిపించడమే లక్ష్యంగా కాంగ్రెస్ రాష్ట్రస్థాయి నేతలు దృష్టి కేంద్రీకరించారు. ఈ పార్లమెంటు సెగ్మెంట్‌లోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు సమన్వయంతో ముందుకుపోతూ జోరుగా ప్రచారాన్ని సాగిస్తున్నారు. అదే విధంగా నేడు కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్ నామినేషన్ వేయనున్నారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని పెద్దశంకరావుపేటలో సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగసభను ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. ఈ సభను విజయవంతం చేసేందుకు జనసమీకరణపై కసరత్తు ప్రారంభించారు.

కాంగ్రెస్‌కు కంచు కోట జహీరాబాద్

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం గతంలో కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండేది. నియోజక వర్గాల పునర్విభజనతో పార్లమెంటు నియోజకవర్గం 2008లో ఏర్పడింది. 2009లో తొలిసారిగా పార్లమెంటు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన అభ్యర్థి సురేష్ షెట్కార్ విజయం సాధించారు. ఈ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో జహీరాబాద్, నారాయణఖేడ్, ఆందోళ్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో గతంలో కాంగ్రెస్ అభ్యర్థులైన గీతారెడ్డి, కృష్ణారెడ్డి, దామోదర్ రాజనర్సింహం ఎమ్మెల్యేగా పని చేశారు. కామారెడ్డి జిల్లాలోని టీడీపీ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. 2009 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సురేష్‌షెట్కార్, టీఆర్ఎస్ అభ్యర్థి సయ్యద్ యుసీఫ్ అలీపై 17వేల మెజార్టీతో విజయం సాధించారు. ఇలాంటి కాంగ్రెస్‌కు కంచుకోట ఉన్న జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం ఉద్యమ నేపథ్యంలో రాష్ట్రం ఏర్పడిన తర్వాత టీఆర్ఎస్ అభ్యర్థి బీబీ పాటిల్ 2014, 2019 ఎన్నికల్లో గెలిచారు. ఈ ఎన్నికల్లోనైనా జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గంపై మరోసారి కాంగ్రెస్ జెండాను ఎగురవేసేందుకు ఆ పార్టీ దృష్టి పెట్టింది.



- జహీరాబాద్ ఎంపీ స్థానం కైవసానికి కాంగ్రెస్ కసరత్తు
- దృష్టి కేంద్రీకరించిన రాష్ట్ర స్థాయి నేతలు
- గెలుపే లక్ష్యంగా సమన్వయంతో ముందుకు
- అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా జోరుగా ప్రచారం
- నేడు నామినేషన్ వేయనున్న కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్
- 26న పెద్దశంకరావుపేటలో సీఎం రేవంత్‌రెడ్డి సభ
- జన సమీకరణకు కసరత్తు

దృష్టి కేంద్రీకరించిన రాష్ట్ర స్థాయి నేతలు

ఈ లోక్‌సభ ఎన్నికలు కాంగ్రెస్‌కు కీలకం కానున్నాయి. రాష్ట్రంలోని మెజార్టీ ఎంపీ స్థానాలను కైవసం చేసుకునేందుకు ఆ పార్టీ అధిష్ఠానం వ్యూహాత్మకంగా ముందుకుపోతోంది. ప్రతీ ఎంపీ స్థానాన్ని గెలుచుకునేందుకు రాష్ట్ర స్థాయి కాంగ్రెస్ నేతలు సైతం దృష్టి కేంద్రీకరించారు. ఇందులో భాగంగా జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల పరిధిలో ఉంది. ఈ రెండు జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేతలు చాలా మంది ఉన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఈ పార్లమెంట్ పరిధిలో ఎల్లారెడ్డి, జుక్కల్, ఆందోల్, నారాయణఖేడ్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. ఇదే పార్లమెంట్ నియోజకవర్గం నుంచి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా రాజనర్సింహ కొనసాగుతున్నారు. పార్లమెంట్ ఎన్నికలకు ఇన్‌చార్జీగా వ్యవహరిస్తున్నారు. మంత్రి రాజనర్సింహ, ప్రభుత్వ సలహదారుడు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంతారావులు, ముఖ్యనేతల సమన్వయంతో గెలుపు కోసం కృషి చేస్తున్నారు. జహీరాబాద్ ఎంపీ స్థానంలో ఎలాగైన కాంగ్రెస్ జెండాను ఎగురవేసి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు పార్టీలోని సీనియర్ నాయకులు ఐక్యంగా ముందుకు కదిలారు. ఆయా నియోజకవర్గాల్లో ఎవరికి వారే సమావేశాలు ఏర్పాటు చేస్తూ కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలంటూ ఆ పార్టీ శ్రేణులను సైతం అప్రమత్తం చేస్తున్నారు.

జోరుగా కాంగ్రెస్ ప్రచారం

జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గాన్ని ఎలాగైన కైవసం చేసుకోవాలనే ఆశతో జిల్లా, రాష్ట్ర స్థాయి నేతలు దృష్టి సారించారు. మొదటి జాబితాలోనే జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా సురేష్‌షెట్కార్‌ను ఖరారు చేసింది. అప్పటి నుంచి పార్టీ అభ్యర్థి ఎన్నికల ప్రచారంపై దృష్టి సారించారు. ఇరు జిల్లాల్లోని కాంగ్రెస్ ముఖ్యనేతలను కలుస్తూ సలహాలు, సూచనలు తీసుకుంటున్నారు. ప్రచారంపై దృష్టి సారించి ఏడు నియోజకవర్గాల్లో ప్రచార ప్రణాళికలను సిద్ధం చేసుకుంటూ ముందుకు పోతున్నారు. ఆయా నియోజకవర్గాల్లోని ఇన్‌చార్జీలతో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులతో కలిసి సభలు, సమావేశాలు నిర్వహిస్తూ పార్టీ శ్రేణులను ఎన్నికలకు సిద్ధం చేస్తున్నారు. మరోవైపు రోడ్‌షోలతో, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలను వివరిస్తూ ప్రజల్లోకి వెళ్తున్నారు. అదే విధంగా ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ సీనియర్లు సైతం సురేష్‌షెట్కార్ తరపున ప్రచారం చేస్తున్నారు. జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో కాంగ్రెస్ జోరుగా ప్రచారాన్ని సాగిస్తోంది.

నేడు నామినేషన్ వేయనున్న కాంగ్రెస్ అభ్యర్థి

ఈ లోక్‌సభ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి కీలకం కానున్నాయి. ఎలాగైన కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు ఆ పార్టీ దేశవ్యాప్తంగా ప్రచారాన్ని జోరుగా సాగిస్తోంది. ఇందులో భాగంగా తెలంగాణపై పార్టీ అధిష్ఠానం ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో మెజార్టీ ఎంపీ సీట్లను కైవసం చేసుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచార ప్రణాళికలను రచించారు. రాష్ట్రంలోని ఎంపీ అభ్యర్థుల గెలుపు కోసం సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతూ బహిరంగ సభలను నిర్వహిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. అదేవిధంగా ఈనెల 26న జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో నారాయణఖేడ్‌లోని పెద్దశంకరావుపేటలో రేవంత్‌రెడ్డి బహిరంగసభను ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. ఈ రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు జనసమీకరణకు జిల్లాలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు కసరత్తు చేపట్టారు. జనాన్ని సభకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.





ధాన్యం కొనుగోళ్లను వేగం చేయాలి

అదనపు కలెక్టర్ చంద్రమోహన్



కొనుగోలు కేంద్రం వద్ద రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

మాచారెడ్డి, ఏప్రిల్ 23: ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ తెలిపారు. మంగళవారం పాల్వంచ మండలంలోని ఎల్పుగొండ, వాడిలలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సందర్శించి ధాన్యం తూకం వేసిన వెంటనే జాప్యం లేకుండా సంబంధిత రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మంచినీరు అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యం తడవకుండా అవసరమైన టార్పాలిన్లు రైతులకు అందుబాటులో ఉంచి వారికి భరోసా కల్పించాలని సూచించారు. రైతులు కూడా ప్యాడీ క్లీనర్ ద్వారా ధాన్యం తూర్పార బట్టి, 17 శాతం తేమ మించకుండా ఎఫ్ఏక్యూ ప్రమాణాల మేరకు తేవాలన్నారు. వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో ధాన్యం తడవకుండా అప్రమత్తంగా ఉండాలని, ధాన్యం కుప్పలపై టార్పాలిన్ కప్పి ఉంచాలని తెలిపారు. ధాన్యం తడిసినా ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, ఎండబెట్టిన తర్వాత కొనుగోలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్‌బాబు, మేనేజర్ నిత్యానందం, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఆరవ రోజు మూడు నామినేషన్లు



సంగారెడ్డి కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న చావగాని మణి

సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 23: జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఆరవ రోజైన మంగళవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థులు సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి క్రాంతి వల్లూరుకు నామినేషన్ పత్రాలను అందజేశారు. బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ తరపున ఆ పార్టీ నాయకులు ఒక సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేయగా, ఇండియా ప్రజాబంధు పార్టీ తరపున బాబు దుర్గయ్య, అలయెన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ తరపున చావగాని మణి నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ల ప్రక్రియ గురువారం ముగియనున్నది.

కాల భైరవస్వామికి ప్రత్యేక పూజలు



రామారెడ్డి, ఏప్రిల్ 23: రామారెడ్డి మండలం ఇస్సన్నపల్లి- రామారెడ్డి గ్రామాల మధ్య వెలసిన కాలభైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం స్వామి పర్వదినం కావడంతో పురోహితులు శ్రీనివాస్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య భైరవునికి క్షీరాభిషేకం, సింధూర పూజలు, అర్చనలు, హారతి వంటి పూజా కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం స్వామి వారి సన్నిదానంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది ఈవో ప్రభు రాంచంద్రంగుప్తా, సురేందర్‌గుప్తా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా హనుమాన్ శోభాయాత్ర



కామారెడ్డిలో శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 26: హనుమన్ జన్మదినోత్సవం పురస్కరించుకొని కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హరిజనవాడ ప్రాంతంలో గల కోడూరి హనుమాన్ ఆలయంలో, పెద్దబజార్‌లోని హనుమాన్ ఆలయంలో, పంచముఖి హనుమాన్ ఆలయంలో, అశోక్‌నగర్‌లోని హనుమాన్ ఆలయంలో, శ్రీరాంనగర్ కాలనీలోని హనుమాన్ ఆలయంలో, వివేకానంద, ఎన్‌జీవోస్ కాలనీలోని ఆలయాలతో పాటు తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతీ సంవత్సరం లాగానే కోడూరి హనుమాన్ ఆలయం వద్ద నుంచి బజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శోభాయాత్రను నిర్వహించారు. ఈ శోభాయాత్రను విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నాయకులు ప్రారంభించారు. ఈ ర్యాలీ పెద్దబజారు, రైల్వేకమాన్‌తో పాటు ప్రధాన వీధుల గుండా తిరిగి పాత బస్టాండ్, సిరిసిల్లా రోడ్డు, జేపీఎన్ రోడ్డు, పాంచ్‌చౌరస్తా గుండా ఆలయం వరకు నిర్వహించారు. ఈ ర్యాలీలో పట్టణంలోని యువకులు కాషాయ వస్త్రాలు, కండువాలు కప్పుకొని పెద్దఎత్తున పాల్గొని నృత్యాలు చేస్తూ శోభాయాత్రను విజయవంతం చేశారు. హనుమాన్ జన్మదినోత్సవం సందర్భంగా పట్టణంలోని అన్ని పార్టీ నాయకులు ర్యాలీలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు. యువకులతో కలిసి నృత్యాలు చేస్తూ ఆద్యంతం ఉత్సాహం నింపేలా చేశారు. అదేవిధంగా ప్రతీ సంవత్సరం లాగే రైల్వేస్టేషన్ నుంచి పంచముఖి ఆలయం వరకు ఆలయ నిర్వాహకులు పట్టు వస్త్రాలు తీసుకువచ్చి స్వామి వారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ హిందుప్రియ, బజరంగదళ్, శివసేన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న దృశ్యం



పెద్దబజార్ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు

'సెలవుల్లో ఇంటి వద్దనే ఉంటూ చదువుకోవాలి'

మోర్తాడ్, ఏప్రిల్ 23: విద్యార్థులు వేసవి సెలవుల్లో ఎండలో తిరగకుండా ఇంట్లోనే పదో తరగతి పుస్తకాలు చదువుకోవాలని పాలెం ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం వేణుగోపాల్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని పాలెం పాఠశాలలో ఉపాధ్యాయులు తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జూన్ 11వరకు వేసవి సెలవులని, తమ పిల్లలను అనవసరంగా బయట తిరగకుండా చూసుకోవాలని అన్నారు



శోభాయాత్రలో పాల్గొన్న నాయకులు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 23: హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించిన హనుమాన్ శోభాయాత్రలో బీఆర్ఎస్ నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేష్‌గుప్త, జీవన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. జిల్లాకేంద్రంలోని గోల్‌హనుమాన్, రేకడ హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శోభాయాత్రలో పాల్గొన్నారు. జడ్పీ కార్యాలయం వద్ద భక్తులకు మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు, పండ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ దండు నీతూకిరణ్, సిర్పరాజు, ప్రభాకర్‌రెడ్డి, సుజిత్‌సింగ్ ఠాకూర్, సత్యప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.



మజ్జిగను అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



శోభాయాత్రలో పాల్గొన్న ఎంపీ అర్వింద్

బోధన్‌లో ఘనంగా వీర హనుమాన్ భారీ శోభాయాత్ర

బోధన్ రూరల్, ఏప్రిల్ 23: హనుమాన్ జయంతి సందర్భంగా విశ్వ హిందు పరిషత్, భజరంగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వీర హనుమాన్ శోభాయాత్ర కార్యక్రమంలో ఎంపీ ధర్మపురి అర్వింద్ పాల్గొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం జెండా ఊపి శోభాయాత్రను ప్రారంభించారు. శోభాయాత్ర పట్టణంలోని మారుతీ మందిరం నుంచి అంబేద్కర్ చౌరస్తా వద్దకు ప్రశాంతంగా సాగింది. పాత బస్టాండ్‌లో హనుమాన్ చాలీసా పారాయణతో, భజరంగ్ నినాదాలతో మార్మోగింది. అనంతరం హిందూ ధర్మ ప్రచారకులు ముత్యం మాట్లాడుతూ హిందువులు ఐక్యంగా ఉండాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అడిషనల్ డీసీపీ కోటేశ్వర్‌రావు, బోధన్ ఏసీపీ శ్రీనివాస్ భారీ బందోబస్తు నిర్వహించారు.

● 'కాంగ్రెస్ మేనిఫెస్టో భయపడేలా ఉంది'

బోధన్ రూరల్: కాంగ్రెస్ మేనిఫెస్టో చూస్తే భయపడేలా ఉందని, ఈ మేనిఫెస్టోను చూసి ప్రధానమంత్రి ఉలిక్కి పడ్డారంటే అది ఎంత భయకరంగా ఉందో అర్థం చేసుకోవాలని ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు.మంగళవారం బోధన్ నియోజకవర్గ బీజేపీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ సంపదను దోస్తాం.. మైనారిటీలకు పంచి పెడతాం అన్నట్లుగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ఉందని ఆరోపించారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీల పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు అటకెక్కాయని ఆయన ఆరోపించారు. మైనార్టీ ఓటు బ్యాంకు వైపే కాంగ్రెస్ చూస్తోందని, తెలంగాణలో అత్యధిక ఎంపీ స్థానాలు బీజేపీ పార్టీ కైవసం చేసుకుంటుందన్నారు. బోధన్‌లో నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల హయాంలోనే మూతపడిందని, ఈ దఫా తాను గెలిచిన అనంతరం తక్షణమే తెరిపిస్తానని, ఇది బీజేపీతోనే సాధ్యమని పేర్కొన్నారు. మారుమారు హ్యాట్రిక్ ప్రధానమంత్రిగా మోదీ కానున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేస్ కులచారి పటేల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాష్ రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు వడ్డీ మోహన్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్, నాయకులు సుధాకర్ చారి, నర్సింహ రెడ్డి, బాలరాజులతో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● 'దేశంలో రామరాజ్య స్థాపన మొదలయ్యింది'

ఖిల్లా: శతాబ్దాల కల అయోధ్యలో రామమందిర ప్రారంభంతో దేశంలో రామరాజ్య స్థాపన మొదలైందని నిజామాబాద్ పార్లమెంటు సభ్యుడు అర్వింద్ ధర్మపురి అన్నారు. హన్మాన్ జయంతి శోభయాత్ర అనంతరం నగరంలోని శివాజీచౌక్ వద్ద విశ్వహిందూపరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేదికలో ఆయన మాట్లాడారు. దేశంలో చట్ట సవరణ చేసుకోవడానికి ఇదే సమయం అని, ప్రధాని మోదీ రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చెప్పారని, మనమందరం మరోసారి మోదీని ప్రధానిగా చూడాలన్నారు. శాంతియుతంగా శోభయాత్ర జరుగడానికి విశ్వహిందుపరిషత్, భజరంగ్‌దళ్ కార్యకర్తల కృషి ఎంతో ఉందన్నారు. ఇందులో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారయణ, విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ప్రముఖులు దినేష్, నందవెంకటేశ్, విభాగ్ తుమ్మలకృష్ణ, గాజుల దయానంద్, డాక్టర్ రాఘవేందర్, అజ్జశ్రీనివాస్, వెంగళ్ల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా మారిన క్రీడా ప్రాంగణాలు

● పేరుకే క్రీడా మైదానాలు ● నిధులు నేల పాలు
● చోద్యం చూస్తున్న అధికారులు ● ఇబ్బందుల్లో క్రీడాకారులు

మెండోర, ఏప్రిల్ 23: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం చర్యలు చేపట్టి చేతులు దులుపుకుంది. దీంట్లో భాగంగా పల్లెలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం నిర్ణయం తీసుకొని నేటికి ఆట స్థలాలు నిరుపయోగంగా ఉన్న కానీ నాటి ప్రభుత్వ అధికారులు, నేటి ప్రభుత్వ అధికారులు క్రీడా మైదానాల వైపు కన్నెత్తి చూడకపోవడంతో నేటికి క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. పల్లెల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకొని గ్రామాల్లో అనువైన స్థలాలను ఎంపిక చేసి క్రీడా బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ లక్ష్యాలు బాగానే ఉన్న క్షేత్రస్థాయిలో మరోలా ఉంది. కొన్ని గ్రామాల్లో స్థలం లేకపోవడంతో పాఠశాల ఆవరణలోనే క్రీడా పోటీలు పెట్టారు. మరికొన్ని చోట్ల అప్పటికప్పుడు చెట్లు, ముళ్లపొదాలను తొలగించి మైదానాలను చదును చేసి ఎంతో ఆర్భటంగా క్రీడా బోర్డులను ఏర్పాటు చేశారు. అంత బాగానే ఉన్న గత ప్రభుత్వ అధికారుల వ్యవహార లోపం కారణంగా నేటికి మైదానాల్లో కంప చెట్లు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో క్రీడలు ఆడేందుకు క్రీడాకారులు ముందుకు రావడంలేదు. పేరుకు మాత్రం బోర్డులను ఏర్పాటు చేసి పట్టించుకోవడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. మైదానాలలో మౌళిక వసతులు ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలమయ్యారని గ్రామీణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

● సదుపాయాలు ఎక్కడ?

మండలంలో వివిధ గ్రామాలలో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాల్లో సదుపాయాలు కల్పించకుండా గత ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం వహించారని విమర్శలు ఉన్నాయి. నేటికి అవి గడ్డి, పిచ్చిమొక్కలతో క్రీడా మైదానాలు దర్శనమిస్తున్నాయి. అధికారులు క్రీడా సామాగ్రి, ఇతర సదుపాయాలను కల్పించకపోవడంతో క్రీడాకారులకు మైదానాలకు దూరంగా ఉంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేకపోవడంతో స్థానికంగా ఉండేప్రభుత్వ పాఠశాల ఆవరణలు ఏర్పాటు చేశారు.దీంతో పాఠశాల సమయంలో క్రీడలు ఆడేందుకు వీలు ఉండకపోవడంతో పాటు పాఠశాల సమయం పూర్తి అయ్యాక గేటుకు తాళలు వేస్తుండడంతో క్రీడా మైదానం విద్యార్థులకు క్రీడాకారులకు క్రీడాప్రాంగణాలు నిరుపయోగంగా మారుతున్నాయి.



మెండోరలో నిరుపయోగంగా క్రీడా మైదానం



పోచంపాడ్‌లో క్రీడా మైదానం

● మండలంలో ఇలా

మండలంలో, గ్రామపంచాయతీలలో క్రీడా మైదానాలు గ్రామాలలో బోర్డులకే పరిమితం తప్ప ఏలాంటి వసతులు లేవు. బోర్డులు దర్శనమిస్తాయి తప్ప ఆటలు ఆడేందుకు వసతులు లేవని క్రీడాకారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో ఒక్కో మైదానం ఏర్పాటు కోసం ఉపాధి హామీ కింద రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు ప్రభుత్వ సొమ్ము ఖర్చు చేశారు కానీ నాటి నుంచి నేటి వరకు ఏలాంటి క్రీడలకు క్రీడా మైదానాలు నోచుకోలేదని, నేటి వరకు నిరుపయోగంగానే ఉన్నాయని క్రీడాకారులు విమర్శిస్తున్నారు.

● నీరుగారుతున్న లక్ష్యం

క్రీడాకారులను ప్రోత్సహం కోసం ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలు ప్రస్తుతం నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతుంది. గ్రామపంచాయతీలకు క్రీడా సామాగ్రి పంపిణీ చేశారు కానీ మైదానాలు సరిగ్గా లేకపోవడంతో ఆటగాళ్లు ఎవరు మైదానాలకు రావడానికి ఆసక్తి చూపడంలేదు. నాటి ప్రభుత్వం నిర్లక్ష్యం దేవుడెరుగు గానీ నేడు అయిన కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని ఇప్పుడైనా క్రీడాకారులను దృష్టిలో పెట్టుకొని నిరుపయోగంగా ఉన్న క్రీడా మైదానాలను క్రీడలు ఆడేందుకు మైదానాలను చదునుచేసి క్రీడా పరికరాలను ఏర్పాటు చేయాలని క్రీడాకారులు వాపోతున్నారు.

వినియోగంలోకి తేవాలి



గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా మైదానాలను అధికారులు పరిశీలించాలి. ఆట స్థలంలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలి. యువత క్రీడామైదానాలకు వచ్చే విధంగా ప్రోత్స హించాలి. క్రీడా సామాగ్రిని అందుబాటులో ఉంచాలి. క్రీడా మైదానాలు వినియోగం లోకి వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటే గ్రామీణస్థాయి క్రీడాకారులు రాష్ట్ర స్థాయి, జాతీయస్థాయిలో రాణించే అవకాశాలు ఉన్నాయి.

- పల్లె లింగారెడ్డి, క్రీడాకారుడు, మెండోర

గ్రామీణ క్రీడాకారులకు మేలు



గ్రామాల్లో ఏర్పాటు చేసిన గత ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యంతో క్రీడా ప్రాంగణాలు నేటికి నిరుపయోగంగానే ఉన్నాయి. నాటి పాలకుల నిర్లక్ష్యం కారణంగా నేడు గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి సమాజానికి ఉపయోగపడే విధంగా తయారు అవుతారనే అనుకున్నారు. కానీ నిరుపయోగంగా ఉండడంతో క్రీడాకారులు క్రీడలకు దూరంగా ఉన్నారు. నేడు క్రీడా ప్రాంగణాలు ఉన్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి క్రీడా మైదానాల్లో అన్ని సదుపాయాలు కల్పించి గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తామన్నారు.

- గుండోజి రవి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు

విద్యార్థులు సెలవుల్లో చెరువులు వద్దకు వెళ్లరాదు

● జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్


కస్తూర్బా గాంధీ పాఠశాలలో వంటలను పరిశీలిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఏప్రిల్23: పాఠశాల విద్యార్థులు వేసవి సెలవుల్లో తమతమ గ్రామాల్లోని చెరువులు, కుంటలు, కాలువల వద్దకు వెళ్లవద్దని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ అన్నారు. మంగళవారం బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంటశాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నాయని సాయంత్రం పూట మాత్రమే ఆటలు ఆడుకోవాలని, చెరువులు, కుంటల వద్దకు వెళ్లవద్దని, ఇంటి వద్ద కఠినంగా ఉన్న సబ్జెక్టులను చదువుకోవాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులకు ఎంపిక ఉపాధ్యాయులు వేసవి సెలవుల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. ఆయన వెంట డీసీడీవో అనిత, ప్రధానోపాధ్యాయులు సూర్యకుమార్, ఖలీల్ హైమద్, కేజీబీవీ ప్రధానోపాధ్యాయురాలు హిమబిందు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తకు పరామర్శ


కాంగ్రెస్ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 23: మండలంలోని ధర్మారం(బి)సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త తొండపి రామారావు ఆనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆరోగ్య విషయాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ ప్రతినిధులు వాసుబాబు, కంచెట్టి గంగాధర్, పులివెంకటేశ్వరరావు, రాధక్రిష్ణ, ఉన్నారు.

యువజన కాంగ్రెస్ నిజామాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా రామర్తి గోపి

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 23: యువజన కాంగ్రెస్ నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జిగా రామర్తి గోపి నియమితులయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉన్న గోపిని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా యువజన కాంగ్రెస్ క్యాడర్‌ను మరింత క్రియాశీలకంగా పనిచేసే విధంగా నిజామాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి ఉత్తర్వులు ఇచ్చారు. జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శి రాష్ట్ర బాధ్యులు సురభి ద్వివేది, రాష్ట్ర అధ్యక్షుడు తనపై నమ్మకంతో నిజామాబాద్ పార్లమెంట్ యువజన కాంగ్రెస్ ఇంచార్జిగా బాధ్యతలు ఇచ్చినందుకు గోపి ధన్యవాదాలు తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జీవన్ రెడ్డి గెలుపు కొరకు యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేస్తామన్నారు.

గోమాతకు పూజలు చేస్తున్న భక్తులు

జక్రాన్‌పల్లి, ఏప్రిల్23: మండలంలో తొర్లికొండ గ్రామంలో శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సుప్రభాత సేవ నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ఉంజాల సేవ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు, గ్రామస్థులు వచ్చి ఆల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి ఆవులను తీసుకువచ్చి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, వీడీసీసభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

తడపాకల్‌లో ప్రపంచ పుస్తక దినోత్సవం


విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఏర్గట్ల, ఏప్రిల్ 23: మండలంలోని తడపాకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఇందూరు జిల్లా బాల సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని నిర్వహించారు. అందులో భాగంగా ఏడవ తరగతి విద్యార్థిని నూకల వైష్ణవి రచించిన మార్పు కథల పుస్తకాన్ని ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ జావిద్ ఆవి ష్కరించారు. చిన్న వయస్సులోనే పుస్తకం రచించడం అభినందనీయమని తెలుగు పండితుడు ప్రవీణ్ శర్మ తెలిపారు. అనంతరం విద్యార్థిని ఉపాధ్యాయుల బృందం శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణప్రసాద్, నరేందర్, గంగాధర్, సుధాకర్‌లు పాల్గొన్నారు.

టీయూ పీజీ రెగ్యులర్ పరీక్షల నోటిఫికేషన్ విడుదల

డిచ్‌పల్లి, ఏప్రిల్ 23: తెలంగాణ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల పరిధిలోని పీజీ రెగ్యులర్ పరీక్షల నోటిఫికేషన్ మంగళవారం విడుదల చేశారు. ఎంఏ, ఎంఎస్సీ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంకాం, ఎల్ఎల్‌బీ,ఎల్ఎల్ఎం, 5ఏళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు ఏపీఈ,ఐఎంబీఏ, ఐపీసీహెచ్ కోర్సులకు చెందిన 4,6,8,10 వ రెగ్యులర్ సెమిస్టర్ థియరీ ప్రాక్టికల్ ఐఎంబీఏ, ఎంసీఏ 4వ సెమిస్టర్,ఐఎంబీఏ 8,10వ సెమిస్టర్ పరీక్షలు జూన్ నెలలో జరగబోయే పరీక్షల ఫీజు తేదీలను ప్రకటించారు. ఫీజు చెల్లించేందుకు ఈ నెల 30వరకు గడువు ఉందని, 100రూ.అపరాధ రుసుముతో మే 6వరకు అవకాశం ఉందని, పరీక్షల నియంత్రణాధికారి ప్రొ.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ సంప్రదించలన్నారు.బీఎడ్ మొదటి సెమిస్టర్ పరీక్షలో 16మంది విద్యార్థులుగైర్హాజరు.తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని బీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు, మంగవారం ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంట చంద్రశేఖర్ తెలిపారు. ఈ పరీక్షకు 283మంది విద్యార్థులకు గాను 267 విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని 16మంది గైర్హాజరయ్యారని, ఘంట చంద్రశేఖర్ తెలిపారు. బీఎడ్ పరీక్ష కేంద్రాలు ప్రభుత్వ గిరిరాజ్ కళాశాల, కామారెడ్డి ప్రభుత్వ సైన్స్ అండ్ ఆర్ట్ కళాశాల, ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ కళాశాల బాన్సువాడ, ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆడిట్ సెల్ అధికారులు తెలిపారు.

బీజేపీలో పలువురి చేరిక

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్23: బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు మంగళవారం అంకాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. కల్లెడ గ్రామానికి చెందిన మాజీఎంపీటీసీ ప్రస్తుత సొసైటీ చైర్మన్ గంగారాంతో పాటు వార్డుసభ్యుడు మోహన్, పాఠశాల చైర్మన్ సాయన్న, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, ఎడ్ల రాం, సాయన్న, నూకల శ్రీనివాస్‌తో పాటు పలువురు బీజేపీలో చేరగా ఎమ్మెల్యే బీజేపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయానికి తమవంతు కృషి చేస్తామని వారన్నారు.

రైతులను ఓట్లడిగే హక్కు బీజేపీకి లేదు

● నిజామాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్23: బీజేపీ రైతు వ్యతిరేక పార్టీ అని వారికి రుణమాఫీ చేసే ఆలోచన ఎంత మాత్రం లేదని నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆర్మూర్ పట్టణంలో పీవీఆర్ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టి.జీవన్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో యూపీఏ పాలనలో ఏకమొత్తంగా రూ.లక్ష రుణమాఫీ చేశామని అన్నారు. బీజేపీకి రైతులకు రుణమాఫీ చేయడానికి ఏనాడు ఆలోచించలేద న్నారు. రైతులకు రుణమాఫీ చేస్తే సోమరిపోతులవుతారని చెబుతున్న మోదీ బడావ్యాపారస్తులకు మాత్రం రూ.16లక్షల కోట్లు మాఫీ చేశారని అన్నారు. రైతులను ఓట్లు అడిగే హక్కు బీజేపీకి లేదని ఆయ న పేర్కొన్నారు.బావులపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులకు విద్యుత్‌భారం కాకూడదని 2004లో అప్పటి సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఉచిత విద్యుత్ ప్రారంభించారన్నారు. ఇదీ కాంగ్రెస్ పార్టీ ఘనత అని పేర్కొన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఉచిత విద్యుత్ ఇస్తున్నారా ఎంపీ అర్వింద్ చెప్పాలని ఆయన ప్రశ్నించారు. రైతులను ఆదుకోవడంలో విఫలమైన బీజేపీ రైతుల మోటర్లకు మీటర్లు పెట్టే ప్రయత్నం చేస్తోందని ఆయన విమర్శించారు. ఎన్నికల సమయంలో ఎంపీ అర్వింద్‌కు రైతులు గుర్తుకు వస్తున్నారన్నారు. గత ఐదేళ్లలో రైతుల కోసం ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. పసుపుబోర్డు ఏర్పాటు చేస్తామని రైతులకు బాండ్ రాసిచ్చారని, పసుపుబోర్డు ఎక్కడ కనబడడంలేదన్నారు. మరోక ఐదేళ్లు అవకాశం ఇవ్వాలని అర్వింద్ అడగడం హాస్యాస్పదమన్నారు. దేశంలో 66చక్కెర కర్మగారాలు పునప్రారంభించామని చెబుతున్న అర్వింద్ బోధన్ ప్యాక్టరీని ఎందుకు ప్రారంభిలేదని ప్రశ్నించారు. చక్కెర కర్మాగారాన్ని పునప్రారంభించాలని అసెంబ్లీలో పలుమార్లు కోరామని జీవన్‌రెడ్డి గుర్తు చేశారు. నిజామాబాద్ రైతులను నాడు కవిత, ఆ తర్వాత అర్వింద్ మోసం చేశారని ఆయన విమర్శించారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ పి.వినయ్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీఅధ్యక్షుడు మార చంద్రమోహన్, పట్ట ణ, మండల పార్టీ అధ్యక్షులు సాయిబాబాగౌడ్, చిన్నారెడ్డి, అయ్యప్ప శ్రీనివాస్, మోత్కురి లింగాగౌడ్, సంజయ్‌సింగ్‌బబ్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై దాడి చేసి మూడు తులాల బంగారు చైన్ అపహరణ

కోటగిరి,ఏప్రిల్23: పోతంగల్ మండలంలోని రంగనాయకులు ఫారం గ్రామంలో భార్గవి అనే వృద్ధురాలిపై మంగళవారం గుర్తు తెలియని దుండగులు దాడి చేసి ఆమె మెడల్లోంచి మూడు తులాల బంగారు చైన్‌ను అపహరించుకుపోయారు. వివరాల్లోకి వెళితే.. రంగనాయకులు ఫారంలో భార్గవి, సుభాష్‌చంద్రబోసు అనే వృద్ధ దంపతులు నివసిస్తున్నారు. వీరి ఇంటి ఆవరణలో మామిడి చెట్లు ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు మధ్యాహ్నం సమయంలో ఇంటికి వచ్చి మామిడి కాయలు కావాలంటూ వృద్ధురాలిని అడిగారు. చెట్టుపై ఉన్న కాయలను చూయిస్తుండగా వెనుక నుండి ఓ వ్యక్తి కర్రతో దాడి చేశాడు. వృద్ధురాలి మెడలో ఉన్న మూడు తులాల బంగారు చైన్‌ను అపహరించుకుని పారిపోయారు. తీవ్ర గాయాల పాలైన వృద్ధురాలిని చికిత్స నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి తనయుడు రత్నబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. గతంలోనూ శేషాద్రి ఫారంలో ఓ వ్యక్తిపై ఇదే విధంగా దాడి చేయడంలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

టీయూ హనుమాన్ ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు

డిచ్‌పల్లి,ఏప్రిల్ 23: తెలంగాణ యూనివర్సిటీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం వర్సిటీ హనుమాన్ ఆలయంలో హనుమాన్ జయంతి నిర్వహించారు. ఈ వేడుకలకు రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి, ప్రొఫెసర్‌లు, నాన్‌టీచింగ్ , టీచింగ్ ,విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

పెర్కిట్, ఏప్రిల్23: విశ్వహిందు పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నిర్వహించిన హన్మాన్ శోభయాత్ర వైభవంగా కొనసాగింది. 11అడుగుల భారీ హన్మాన్, శ్రీరాముని విగ్రహల ప్రతిమలతో శోభయాత్ర ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి అనంత ఆంజనేయస్వామి మందిరం నుంచి అంబేద్కర్‌చౌరస్తా మీదుగా పెద్దబజార్, చిన్నబజార్, శివాజీచౌక్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి శోభయాత్రలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు విజయభారతి, ఆర్ఎస్ఎస్ విభాగ్ కార్యవహ రాజులవారి దిగంబర్, విశ్వహిందు పరి షత్ సభ్యులు, భజరంగ్‌దళ్ సభ్యులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో పూజలు


జలాల్‌పూర్‌లో మాజీ ఎమ్మెల్యేకు మెమోంటో అందజేస్తున్న దృశ్యం

వర్ని,ఏప్రిల్23: వర్ని, చందూర్ మండలాల పరిధిలో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా మండల కేంద్రాలు, గ్రామాల్లో హనుమాన్, శ్రీరామ మందిరాలలో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్ని ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జలాల్‌పూర్ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి శ్రీ రామ మందిరంలో పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు మెమోంటో బహుకరించారు.

పలు ప్రాంతాల పరిశీలన


ఆర్మూర్ సానిటేషన్ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్23: మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాలను మంగళవారం మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. ఎన్నికల దృష్ట్యా పెర్కిట్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును, ఫారెస్టు నర్సరీలో పెంచుతున్న మొక్కలను, గోల్‌బంగ్లా వద్ద సానిటేషన్ ప నులను, గూండ్ల చెరువు వద్ద ఓపెన్ జిమ్ములతో పాటు మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఆయన పరిశీలించారు. అలాగే బస్టాండ్ ప్రాంతంలో అక్రమంగా ఏర్పాటు చేసుకున్న పండ్ల దుకాణాలు తొలగించాలని, డ్రైనేజీ కాలువ నిర్మాణం చేపడతామని పండ్ల దుకాణదారులను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ డీఈ భూమేశ్వర్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ మహేష్, ఏఈ రఘు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

గంజాయిని పట్టుకున్న ఎక్సైజ్ పోలీసులు

● 1.25 కేజీల గంజాయి స్వాధీనం ● ముగ్గురి అరెస్టు


పట్టుకున్న నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 23: గంజాయిని అమ్ముతున్న ముగ్గురిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి 125 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ దిలీప్ తెలిపారు. మంగళవారం నమ్మదగిన సమాచారం మేరకు నగరంలోని ఆటోనగర్‌లో షకీలాబీ ఇంట్లో తనిఖీ చేయగా గంజాయి దొరికిందని వారిని విచారించగా తన కూతురు నాందేడ్ జిల్లాకు వెళ్లి గంజాయి కొనుగోలు చేసుకొని వచ్చి చిన్న చిన్న ప్యాకెట్లు చేసి అల్లుడు షేక్ వసీమ్ ద్వారా నిజామాబాద్‌లోని యువతకు అమ్ముతున్నట్లు తెలిపారు. గంజాయి అమ్ముతున్న షకీలాబీ, కూతురు అస్మా, అల్లుడు షేక్ వాసిమ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామన్నారు. ఈ దాడుల్లో ఎస్సై మల్లేష్, సిబ్బంది ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

దొన్కల్ మాజీసర్పంచ్ కాంగ్రెస్‌లో చేరిక

మోర్తాడ్, ఏప్రిల్23: మండలంలోని మాజీ సర్పంచ్ కత్తిముత్తెన్న కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం మోర్తాడ్‌లోని ప్రజా భవన్‌లో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ సమక్షంలో చేరారు. వారికి సునీల్‌కుమార్ కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గడ్డం అనిల్, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, మహిపాల్, పర్స దేవన్న, దొన్కల్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లిలో ఆదినాథస్వామి రథోత్సవం

జక్రాన్‌పల్లి, ఏప్రిల్23: జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో మంగళవారం శ్రీ ఆదినాథస్వామి ఆలయ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. రథోత్సవం అంగరంగా వైభవంగా నిర్వహించారు. బుధవారం చక్రతీర్థం, గురువారం స్వామివారి నాగవెళ్లి జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జాతర సందర్భంగా ఆలయ ప్రాంతంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు.

ముగిసిన హనుమాన్ దీక్షలు


మోస్రాలో పూజలు చేస్తున్న స్వాములు

మోస్రా,ఏప్రిల్23: మండల కేంద్రంతో పాటు చింతకుంట, గోవూర్, తిమ్మాపూర్, చే నెంబర్ తండా గ్రామాలలో హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమం అనంతరం హనుమాన్ స్వాములు మాల విరమణ కోసం కొండగట్టు, భద్రాచలం పుణ్య క్షేత్రాలకు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో మండల గురుస్వాములు, స్వాములు పాల్గొన్నారు.

27న ఓయూలో మాదిగ విద్యార్థుల సదస్సు

డి చ్‌పల్లి, ఏప్రిల్ 23: ఈ నెల 27న ఉస్మానియా యూనివర్సిటీ లో తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల మాదిగా విద్యార్థుల సదస్సు జరగ నుందని, ఈ సదస్సును జయప్రదం చేయాలని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సందే కార్తిక్ మాదిగా యూనివర్సిటీ అధ్యక్షుడు దినేష్ మాదిగా అన్నారు. మంగళవారం టీయూలో అధికార ప్రతినిధి వెంకటరమణతో కలిసి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్‌లు, ఏ,బీ,సీ,డీ వర్గీకరణ వేగవంతం చేయాలని ఇందుకు సహకరిస్తున్న ప్రధానమంత్రి మోదీకి ప్రత్యేక ధన్యవాదలు తెలిపారు. మాదిగాల చిరాకల వాంఛ ఎస్సీ రిజర్వేషన్, ఏ,బీ,సీ,డీ వర్గీకరణ సాధనకు మోదీ హైదరాబాద్ కేంద్రంగా తోడుంటానని తెలపడమే ఇందుకు నిదర్శనమన్నారు. సుప్రీం కోర్టులో కూడా తీర్పు రిజర్వ్ చేసి ఉంచారని, త్వరలో ఈ తీర్పు సానుకూలంగా వస్తుందన్నారు.

రైతులు ధాన్యాన్ని తడవకుండా చూసుకోవాలి


ఏర్గట్లలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏవో మాలిక్

ఏర్గట్ల, ఏప్రిల్ 23: మండల కేంద్రంలోని పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం మండల వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్ సందర్శించి ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రెండు మూడు రోజుల్లో వర్ష సూచన ఉన్నందున రైతులు ధాన్యం తడవకుండా ఉండేందుకు టర్పాలిన్‌లతో కప్పి ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ సీఈవో జక్కని శ్రీనివాస్, సెంటర్ ఇంచార్జి సతీష్ గౌడ్, రైతులు పాల్గొన్నారు.

పాలెం పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష వితరణ


పాలెం పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష అందజేసిన సుంకం రాజేశ్వర్

మోర్తాడ్, ఏప్రిల్23: మండలంలోని పాలెం ఎస్‌పీయూపీఎస్ పాఠశాల అభివృద్ధికి మంగళవారం రిటైర్డు ఎంపీడీవో సుంకం రాజేశ్వర్ రూ.లక్షలను అందజేశారు.పాఠశాల భవనానికి, తరగతి గదులకు, ప్రహరీకి, పేయింటింగ్, పాఠశాల గేట్, తదితర అభివృద్ధి పనులకు రూ.లక్ష అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం లక్ష్మీనర్సయ్య, ఉపాధ్యాయులు సుం కం రాజేశ్వర్‌ను అభినందిస్తూ ఘనంగా సన్మానించారు.ఈకార్యక్రమంలో రాజేశ్వర్, సుంకం లక్ష్మణ్ కుటుంబసభ్యులు, గ్రామస్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడా సంఘాలకు రాజకీయ నాయకులు వద్దు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 23:జిల్లాలో ఉన్న క్రీడా అసోసియేషన్‌లకు రాజకీయ నాయకులు నాయకత్వం వహించ వద్దని క్రీడాకారులను క్రీడా సంఘాలకు బాధ్యులను చేయాలని జాతీయ స్థాయి మాజీ క్రీడాకారుడు సయ్యద్ ఖైసర్ డివైఎస్‌వోకు ఫిర్యాదు చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా క్రీడా సంఘాలన్నీ రాజకీయ నాయకులతో నిండి ఉన్నాయని ఒక్క క్రీడా అసోసియేషన్ క్రీడా కారుల చేతుల్లో లేదని అన్నారు. రాజకీయ నాయకులకు క్రీడా సంఘాలతో ఏం పని ఉంటుందన్నారు. ఇప్పటికైనా క్రీడా సంఘాలకు క్రీడాకారులనే అసోసియేషన్ బాధ్యులుగా చేయాలని విన్నవించారు.అంతేకాకుండా అర్బన్‌లోసమ్మర్ కోచింగ్‌క్యాంప్‌ఏర్పాటు చేయాలన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి

మద్నూర్, ఏప్రిల్ 23: మండలంలోని ఆయా గ్రామాల్లో హనుమాన్ జయంతిని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఏ గ్రామంలో చూసినా ఆంజనేయ స్వామి ఆలయాల్లో జై హనుమాన్ అంటూ నినాదాలు మారుమోగాయి. హనుమాన్ ఆలయాల వద్ద తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రధానమైన సలాబత్‌పూర్ అంజనేయ స్వామి ఆలయానికి జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావులు విచ్చేసి తెల్లవారు జామున పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. లక్షలాది మంది రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. మాజీ ఎంపీ, ఎమ్మెల్యేకు పూర్ణాహుతితో స్వాగతం పలికారు. ఆలయంలో పూజలు చేశారు. ఆలయంలో రంగు రంగుల పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బిచ్కుంద సీఐ నరేష్, మద్నూర్ ఎస్సై, ఆయా మండలాల ఎస్సైలు, పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆంజనేయ స్వామి ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

అయోధ్యకు తరలిన అంజన్న స్వాములు

మద్నూర్ మండలం నుంచి 40 రోజులు దీక్ష చేపట్టిన అంజన్న స్వాములు, కొండగట్టులో ప్రత్యేక పూజలు చేసి, అయోధ్యకు తరలివెళ్లారు. ఆరుగురు స్వాములు అయోధ్యకు వెళ్లారన్నారు. అంజన్న స్వాములకు కుటుంబ సభ్యులు భక్తి శ్రద్ధలతో పూజలు చేసి వీడ్కోలు పలికారు.

బీబీపేట: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వీరహనుమాన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఉదయం నుంచే అలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం దాతల సహాయంతో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. హనుమాన్ మాలధారణ స్వాములు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవునిపల్లి శ్రీనివాస్, ప్రసాద్, సాయి, శివ, రాము పాల్గొన్నారు.

గాంధారి: మండలంలో హనుమాన్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం లాగే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహించారు. గండివేట్ గ్రామంలో హనుమాన్ మాల ధరించిన భక్తులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు.

తాడ్వాయి: మండలంలో హనుమాన్ దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నందివాడ, ఎండ్రియాల్, దేమికలాన్, బ్రాహ్మణపల్లి, కన్కల్ గ్రామాల్లో భక్తులు హనుమాన్ జన్మదిన ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. తాడ్వాయిలో ప్రత్యేకంగా ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు భక్తులకు పండ్ల రసాలు అందించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

బిచ్కుంద: మండలంలోని అన్ని గ్రామాల్లో హనుమాన్ జన్మదిన వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం పట్టణంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండేలు వేరువేరుగా పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారికి పూజలు నిర్వహించగా భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

రామారెడ్డి: హనుమాన్ జన్మదినం పురస్కరించుకుని మంగళవారం హనుమాన్ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సింధూర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించడంతో పాటు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రవీందర్‌రావు, ఎంపీటీసీలు రజిత, ప్రవీణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: మండల కేంద్రంతో పాటు లింగుపల్లితో పాటు ఆయా గ్రామాల్లో మంగళవారం హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆముదాలపల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దోమకొండ అముదాలపల్లి, లింగుపల్లి గ్రామాల్లో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, హనుమాన్ మాలదారులు, భక్తులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్: మండలంలోని ఆయా గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.



సలాబత్‌పూర్ ఆలయానికి పోటెత్తిన భక్తులు

పెద్ద కొడప్‌గల్: మండల కేంద్రంతో పాటు, మండలంలోని ఆయా గ్రామాల్లో హనుమాన్ జయంతిని ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం హనుమాన్ ఆలయాలను నీటితో శుభ్రం చేసి అందంగా రంగులు వేసి ఆలయాలను ముస్తాబు చేశారు. అనంతరం అయ్యవార్లు స్వామికి చందన పూజలు నిర్వహించి, స్వామి వారికి ఇష్టమైన నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం కొన్ని గ్రామాల్లో స్వామి వారికి బారసాల నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాలకు భక్తులు పోటెత్తడంతో ఆలయాలు సందడిగా మారాయి. అనంతరం కార్యక్రమానికి హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇక బేగంపూర్ హనుమాన్ ఆలయంలో జరిగిన పూజలకు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావ్ హాజరై స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ వారు ఎమ్మెల్యేను సన్మానించారు.

లింగంపేట: మండలంలోని ఆయా గ్రామాల్లో హనుమాన్ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ చిత్రపటంతో గ్రామాల్లోని పురవీధుల గుండా బాజాబజంత్రీలతో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం హనుమాన్ ఆలయాల వద్ద భక్తులకు అన్నాదానం చేపట్టారు. ఈ శోభాయాత్రలో ఆయా గ్రామాల్లోని హనుమాన్ మాలాధారులు, భక్తులు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని చిన్న హనుమాన్ ఆలయం వద్ద భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణలతో ఆలయాలు మారుమోగాయి. భక్తుల నినాదాలతో హోరెత్తించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ కార్యకర్తలు ఆధ్వర్యంలో హనుమాన్ ర్యాలీని పట్టణ కేంద్రంలోని పుర వీధుల్లో తిరుగుతూ నినాదాలు చేస్తూ హనుమాన్ విగ్రహాన్ని అలంకరించి డీజే సౌండ్‌లతో నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా తిరిగారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



లింగంపేటలో శోభాయాత్ర..



ఎల్లారెడ్డిలో..



బీబీపేట హనుమాన్ ఆలయంలో పూజలు



తాడ్వాయిలో..



దోమకొండలో..



పెద్దకొడప్‌గల్‌లో..

గజ్జెలమ్మ జాతర ఉత్సవాలు ప్రారంభం

బీర్కూర్, ఏప్రిల్ 23: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలో గజ్జెలమ్మ జాతర ఉత్సవాలను గ్రామ పెద్ద లు, ఎంపీపీ రఘు ప్రారంభించారు. గజ్జెలమ్మ ఆలయంలో గ్రామ పెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథానికి శిఖర ప్రతిష్ఠ చేసి, జాతర ఉత్సవాలను ప్రారంభించారు. ప్రతియేటా హనుమాన్ జయంతి సందర్భంగా గజ్జెలమ్మ జాతర ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మూడు రోజుల పాటు ఉత్సవాలు కొనసాగనున్నాయి. హను మాన్ జయంతి సందర్భంగా రథ శిఖర ప్రతిష్ఠ చేశారు. బుధవారం రథో త్సవం జరుగుతుంది. గురువారం కుస్తీ పోటీలు నిర్వహిస్తారు. ఈ ఉత్స వాలకు భక్తులు దూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివస్తారు.

బీర్కూర్‌లో చలివేంద్రం ప్రారంభం

బీర్కూర్, ఏప్రిల్ 23: మండల కేంద్రంలోని కామప్ప చౌరస్తాలో బీర్కూర్ గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం తహసీల్దార్ లత చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి కాలంలో ప్రయాణీకుల దాహార్తిని తీర్చేందు కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం గొప్ప విషయమని తహసీల్దార్ పేర్కొన్నారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి గంగారాం, సిబ్బంది, ప్రకాష్, హన్మంత్, ప్రవీణ్, సాయి తదితరులు ఉన్నారు.

వేసవి సెలవుల్లో నైపుణ్యం పెంచుకోవాలి

నిజాంసాగర్ ఏప్రిల్ 23: విద్యార్థులు వేసవి సెలవుల్లో నైపుణ్యం పెంచుకోవాలని జిల్లా విద్యాశాఖ ఏయంవో వేణు శర్మ అన్నారు. మంగళవారం వేసవి సెలవుల్లో త్వరగా మేల్కొని రోజు వారి దినచర్య రూపొందించుకోవాలని, యోగా ధ్యానం, వాకింగ్, పెయింటింగ్, డ్యాన్సు, సంగీతం, శాఖ గ్రంథాలయానికి వెళ్లి పుస్తక పఠనం, తెలుగు, ఇంగ్లిష్, హిందీ చూచి రాత, తదితర నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రోగ్రెస్ రిపోర్టులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయుడు రాంచందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వేణు శర్మ

ముగిసిన పరీక్షలు.. ఇంటికి విద్యార్థులు

పెద్ద కొడప్‌గల్: పాఠశాల విద్యార్థులకు పరీక్షలు ముగియడంతో వేసవి సెలవులు ప్రకటించారు. మండలంలోని వివిధ వసతి గృహాలు, గురుకుల పాఠశాల విద్యార్థులు ఇంటి బాట పట్టారు. గత రెండు కిందటే విద్యార్థులకు పరీక్షలు పూర్తి కాగా మంగళవారం విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. దీంతో విద్యార్థులు ఈ విద్యా సంవత్సరం పూర్తి కావడంతో తమ ఇండ్లకు పయనమయ్యారు. వసతి గృహాలలో ఉంటున్న దూర ప్రాంత విద్యార్థులను తీసుకవెళ్లడానికి వారి పేరెంట్స్ రావడంతో వసతి గృహాల వద్ద సందడి నెలకొంది. చాలా రోజుల నుంచి కలిసి ఉంటున్న విద్యార్థులు తిరిగి జూన్ నెలలో కలుద్దామంటూ ఒకరికొకరు చెప్పుకుంటూ తమ తల్లితండ్రులతో కలిసి ఇంటికి బయలుదేరారు. ఇంటికి వెల్తున్నామన్న సంతోషంతో కేరింతలు కొడుతూ ఇండ్లకు పయనమయ్యారు.



బస్వాపూర్‌లో అమ్మవారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

కన్నుల పండువగా రేణుకా జమదగ్నిల కల్యాణం

బిక్కనూరు, ఏప్రిల్ 23:మండలంలోని బస్వాపూర్, పెద్దమాల్లారెడ్డి గ్రామాలలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రేణుక ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవ జాతర కొనసాగుతున్నాయి. వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం ఆయా గ్రామాలలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఆలయ అర్చకులు ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహాలను డప్పుచప్పుల్ల నడుమ ఊరేగించారు. అనంతరం ఆయా ఆలయ ప్రాంగణంలో అందంగా ముస్తాబు చేసిన ముత్యాల పందిరిలో రేణుకాఎల్లమ్మ జమదగ్నిల కల్యాణాన్ని వేదబ్రహ్మణుల మంత్రోత్సరణల నడుమ కన్నుల పండగల నిర్వహించారు. అనంతరం గౌడ సంఘం ఆధ్వర్యంలో మహిళలు ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా బస్వాపూర్ గ్రామంలో ఎల్లమ్మ అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం అమ్మవారికి బోనాలు సమర్పించారు.



చాముండేశ్వరీ ఆలయం ఆవరణలో పూజలు

చాముండేశ్వరీ ఆలయంలో పూజలు

దోమకొండ, ఏప్రిల్ 23: మండల కేంద్రంలోని చాముండేశ్వరీ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం శాంతిపఠనము మత్రుకా, యోగినీ, క్షేత్రపాలక, నవగ్రహ, సర్వతోభద్ర, ప్రాతఃకాల పూజలు గణపతి, మంత్రపుష్పము, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ పాలకుర్తి శేఖర్ తెలిపారు. 28వరకు ఆలయంలో కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు.

'కరపత్రాలతో ప్రచారం నిర్వహించాలి'

పెద్ద కొడప్‌గల్, ఏప్రిల్ 23: మండలంలోని ఆయా గ్రామాలలో గల బీజేపీ గ్రామ కమిటీల బూత్ అధ్యక్షులు కర పత్రాలతో నేడు ఇంటింటి ప్రచారం నిర్వహించాలని మండల బిజెపి ప్రదాన కార్యదర్శి జైపాల్ రెడ్డి తెలిపారు. పార్టీ ఆదేశానుసారం అన్ని గ్రామాల బూత్ అధ్యక్షులు, ప్రదాన కార్య దర్శులు, మండల బాధ్యులతో కలిసి గ్రామాలలో ఇంటింటి ప్ర చారం నిర్వహించాలని సూచించారు. ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు.



ఎల్లారెడ్డిలో ఘనంగా రథోత్సవం

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 23: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో సోమవారం రామాలయం వద్ద శ్రీరామ నవమిని పురస్కరించుకుని జాతర మంగళవారం ఉదయం 12 గంటలకు ప్రారంభమైన రథయాత్ర నాలుగు గంటలకు పూర్తి చేశారు. రథ యాత్రలో సీతారాముల విగ్రహాలను ఊరేగించారు. భక్తులు తబలా తాళాలతో రథాన్ని లాగుకుంటూ జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ రామ నామాన్ని జపిస్తూ ఘనంగా రథోత్సవాన్ని కొనసాగించి ముగించారు. ఈ రథోత్సవాన్ని తిలకించడానికి ఎల్లారెడ్డికి చుట్టూ పక్కల గ్రామాల్లోని భక్తులు, ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. ఈ రథోత్సవ కార్యక్రమానికి రామాలయ ధర్మకర్తలు సిద్ది వారి కుటుంబ ప్రకాష్, చక్రధర్, భైరవ ప్రసాద్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

నసురుల్లాబాద్, ఏప్రిల్ 23: మండలంలోని సంగం గ్రామంలో నసురుల్లాబాద్ ఎస్సై లావణ్య మంగళవారం బెల్టు దుకాణాలను తనిఖీ చేయగా, సంఘం గ్రామంలో జరుపల రూప్‌సింగ్ తండ్రి కిసన్ అనే వ్యక్తులు అక్రమ మద్యం అమ్ముతున్నారని సమాచారం అందడంతో నసురుల్లాబాద్ ఎస్సై లావణ్య తన బృందంతో బెల్టు షాప్‌పై దాడి చేసి వారి వద్ద ఉన్న అక్రమ మద్యం, 3.46 లీటర్లు దీని విలువ రూ.2876 ఉంటుందని, నసురుల్లాబాద్ ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఎవరైనా బెల్టు సాపులు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

బిచ్కుంద, ఏప్రిల్ 23: ప్రభుత్వ అనుమతులు లేకుండా సోమవారం సాయంత్రం అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్‌లను మండల తహసీల్దార్ పట్టుకుని పోలీసుస్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మోహన్‌రెడ్డి తెలిపారు. మంజీరా పరివాహక ప్రాంతాల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు.

మహిళ అదృశ్యం

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 23: రామారెడ్డి మండలం పోసానిపేట గ్రామానికి చెందిన తెడ్డు అనిత అనే మహిళ అదృశ్యమైనట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం బీబీపేట మండలం జనగామ గ్రామంలో పసిరికలకు మందు తాగి తిరిగి కామారెడ్డి బస్టాండ్ వద్ద ఆటో దిగింది. ఈ తర్వాత నుంచి ఆమెకు ఫోన్‌చేస్తే ఫోన్ లిఫ్ట్ చేయడం లేదు. దీంతో భర్త చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినా ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో ఆమె భర్త బాలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్	మనజుమిల్ బాయ్స్
శాంతి	టిల్లు స్క్వేర్
ప్రియా 70	ది ఫ్యామిలీ స్టార్
ప్రియా 35	గీతాంజలి మళ్లీ వచ్చింది

బాన్సువాడ

మహేశ్వరి	టిల్లు స్క్వేర్
వెంకటేశ్వర	పారిజాత పర్వం

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	100	160	180
వెన్‌కాబ్(కిలో)	100	180	210

